క్లుప్తంగా

నేడు ఫైబర్ బోట్ల పంపిణీ

నాగాయలంక: ప్రజా ప్రగతి సేవా సంఘం ఆధ్వర్యంలో నాగాయలంక, కోడూరు మండలాలకు చెందిన 80 ఎస్.టి (యానాదులు) కుటుంబాలకు నాబార్డు (ట్రైబల్ డెవలప్‌మెంట్ ఫండ్స్) ఆర్థిక సహాయంతో గురువారం రెండో విడత ఫైబర్ బోట్లను పంపిణీ చేస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, కోఆర్డినేటర్ నక్కా విజయబాబు బుధవారం రాత్రి తెలిపారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా ఈ కార్యక్రమానికి హాజరవుతారు. స్థానిక శ్రీరామపాద క్షేత్రం పుష్కరఘాట్ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో 80 మంది లబ్ధిదారులకు రూ.50 లక్షల విలువైన ఫైబర్ బోట్లు, ఇతర ఉపకరణాలను అందిస్తారు. కార్యక్రమంలో నాబార్డు అధికారులు పాల్గొంటారు.

కిశోర వికాసంపై శిక్షణ



కృత్తివెన్ను: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద కిశోర వికాసంపై బుధవారం ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సీడీపీవో సముద్రవేణి ప్రారంభించారు. ఆమెతో పాటు ఇన్‌చార్జ్ ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఎస్ఐ పైడిబాబు, పీహెచ్‌సీ వైద్యులు సందీప్ మాట్లాడుతూ 11 నుంచి 18 సంవత్సరాల వయస్సు అతి ముఖ్యమైనదని వివరించారు. ఆత్మరక్షణ, బాల్యవివాహాలు, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, రుతుస్రావ పరిశుభ్రత, లింగవివక్షత, నాణ్యమైన విద్య, పోక్సోయాక్ట్ తదితర అంశాలను వివరించారు. ఏపీఎం శ్రీనివాస్, ఎంఈవో ప్రసాదరావు, కార్యదర్శి నరసింహారావు, సునీత, సెక్టార్ సూపర్‌వైజర్ శ్యామలగౌరి, ఉపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, జీఎంఎస్‌కేలు, అంగన్‌వాడీ వర్కర్లు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి రాజగోపుర శిఖర మహోత్సవాలు

గూడూరు: స్థానిక శ్రీ వెంకటాచల స్వామి దేవస్థానంలో నూతనంగా నిర్మించిన రాజగోపుర శిఖర, గోదాలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.వి.వి.మోహనరావు తెలిపారు. గురువారం సాయంత్రం విష్వక్సేన పూజతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయని తెలిపారు. శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. శనివారం ఉదయం 8.19 గంటలకు రాజగోపుర శిఖర ప్రతిష్ఠ, గోదాలక్ష్మి బింబస్థాపన నిర్వహించనున్నట్లు ఈఓ వెల్లడించారు.

సేంద్రియ సాగుపై అవగాహన ర్యాలీ



బోడగుంట(మోపిదేవి): సేంద్రియ ఎరువులను వాడి కాలుష్యం తగ్గించి భూమిని సంరక్షించుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య తెలిపారు. కేవీకే ఘంటశాల ఆధ్వర్యంలో బాపట్ల కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకం- ప్రత్యేక శిబిరంలో బుధవారం బోడగుంట నుంచి మోపిదేవి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. బాపట్ల కళాశాల విద్యార్థులు, రావివారిపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

కోడూరు: సాగునీటి సంఘాల ఎన్నికలను సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ శ్రీనునాయక్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలో 96 ప్రాదేశిక నియోజకవర్గాలు, ఎనిమిది నీటి వినియోగదారుల సంఘాలు, ఒక డిస్ట్రిబ్యూటరీ కమిటీకి ఎన్నికల నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చెప్పారు. ఈ నెల 14న ప్రాదేశిక నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికలు ఉంటాయని, ఈ ఎన్నికల కోసం మండలంలో ఎనిమిది పోలింగ్ కేంద్రాలను కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వి.కొత్తపాలెం, విశ్వనాథపల్లి, సాలెంపాలెం, ఉల్లిపాలెం, రామకృష్ణాపురం, మందపాకల పంచాయతీల పరిధిలోని ఒకొక్క కేంద్రంలో 12 ప్రాదేశిక నియోజకవర్గాలకు, కోడూరులోని రెండు బూత్‌ల వద్ద 24 ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నిక ఉంటుందన్నారు. అదే రోజు నీటి వినియోగదారులు సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికలను కూడా నిర్వహించి, జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చెప్పారు. 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక ఉంటుందన్నారు. సిబ్బంది ఎన్నికలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికలను నిర్వహణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎంపీడీఓ సుధాప్రవీణ్, ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు, ఈఓపీఆర్డీ నాగరేవతి, డీటీ పద్మప్రియ, ఆర్ఐ సుభాషిణి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగు సమరానికి సిద్ధం

- 14న నీటి సంఘాల ఎన్నికలు
- నోటిఫికేషన్ జారీ చేసిన రెవెన్యూ అధికారులు
- పది చోట్ల పోలింగ్ కేంద్రాలు
- ఐదు డిస్ట్రిబ్యూటరీ కమిటీలలో భాగస్వామ్యం

పెడన: సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్డీయే కూటమి ప్రభుత్వం గత నెలలో నోటిఫికేషన్ విడుదల చేసినా మళ్లీ వాయిదా వేసింది. ప్రస్తుతం మళ్లీ ఎన్నికల హడావుడి మొదలైంది.

నోటిఫికేషన్ విడుదల..

ప్రస్తుతం ఈ నెల 14న ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధమైంది. ఈ మేరకు పెడన తహసీల్దార్ కె.అనిల్ కుమార్ నోటిఫికేషన్ జారీ చేశారు. గత నెలలోనే సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియను సంబంధిత శాఖాధికారులు ప్రారంభించారు. ఇరిగేషన్ అధికారులు పెడన మండలంలోని సాగునీటి కాలువల కింద ఏయే సర్వే నంబర్లు ఉన్నాయనే విషయాలను తెలియజేస్తూ పంచాయతీ కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో పెట్టారు. నీటి పారుదల శాఖ ఆ దిశగా చర్యలు చేపట్టి ఓటరు జాబితాలను తయారు చేసేందుకు రెవెన్యూ శాఖకు అప్పగించడంతో ఆయా సర్వే నంబర్ల ఆధారంగా ఏయే రైతులున్నారనే దానిపై మండల రెవెన్యూ శాఖలోని వీఆర్వోలు జాబితాలు సిద్ధం చేశారు.

సిద్ధంగా ఓటర్ల జాబితా..

దీంతో గత నెల 10న ముసాయిదా జాబితాను వెల్లడించారు. నలుగురు అభ్యంతరాలను తెలియజేయడంతో వారు దస్తావేజులు తీసుకువచ్చి ఆధారాలు చూపించడంతో వారిని ఓటర్లుగా చేర్పించారు. నవంబరు 20న తుది ఓటరు జాబితాలను సైతం వెల్లడించారు. 21న జరగాల్సి ఈ నీటి సంఘ ఎన్నికలను వాయిదా వేసింది.

10 పోలింగ్ కేంద్రాలు.. 10 వేలకు పైగా ఓటర్లు..

మండల పరిధిలోని వివిధ సాగునీటి కాలువల కింద సాగు చేసే రైతులు పది వేలకు మందికిపైగా ఉన్నారని రెవెన్యూ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. గత నెల 20న ఓటర్ల జాబితా ప్రకారం 10 వేల నుంచి 11 వేల మధ్యలో ఓటర్లు ఉన్నారు. వీరు ఓటు హక్కు వినియోగించుకోవడానికి పెడన మండలంలో పది పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. 18 సాగునీటి సంఘాలు ఉన్నాయి.



నందిగామ జెడ్పీహెచ్ఎస్‌లో నోటిఫికేషన్‌ను ప్రదర్శిస్తున్న వీఆర్వో

చేతులు ఎత్తే పద్ధతిలో..

ఈ నెల 14న జరిగే పోలింగ్ (చేతులు ఎత్తే పద్ధతి ద్వారా ఎన్నిక)కు పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేసి ఆయా కేంద్రాల్లో ఓటరు జాబితాలు, ప్రభుత్వ నోటిఫికేషన్లను పెట్టారు. పెడన మండలంలో నడుపూరు, కవిపురం, చోడవరం గ్రామాల్లోని ఎంపీయూపీ స్కూల్స్‌లోను, నందిగామ, పెనుమల్లి, చెన్నూరు, పెడన బీజీకే, చేవేంద్ర, నందమూరు జెడ్పీహెచ్ఎస్‌లలోను, కమలాపురం గ్రామ సచివాలయంలో ఈ నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఉదయం 8 గంటలకే..

ఆ రోజు ఉదయం ఆయా పోలింగ్ కేంద్రాలలో జరిగే ఈ నీటి సంఘ ఎన్నికలకు సంబంధించి ఎవరు పోటీ చేస్తున్నారు, ఎవరు ఎవరికి మద్దతు ఇస్తున్నారు, అలాగే బలపరుస్తున్నారనే వివరాలను 8 గంటల నుంచి ప్రారంభించనున్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, పోటీ దారుల తుది జాబితా వెల్లడి చేస్తారు. అనంతరం చేతులు ఎత్తే పద్ధతి ద్వారా ఓటింగ్, లెక్కింపు అనంతరం ప్రాదేశిక నియోజకవర్గ నీటి సంఘాలకు సంబంధించి సభ్యులను ఎన్నుకుంటారు.

ఒక్కొక్క సంఘానికి పది నుంచి 12 మంది సభ్యులుండే అవకాశాలున్నాయి. ఈ సభ్యులంతా కలిసి మధ్యాహ్నం 3 గంటలకు సమావేశమై ఆ నీటి సంఘ పరిధిలో అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికైన అధ్యక్షులంతా డీసీ (డిస్ట్రిబ్యూటరీ కమిటీ)లలో అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. వీరంతా ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటారు.

10 మంది ఎన్నికల అధికారులు..



సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఈ నెల14న ఎన్నికలు ఉంటాయి. వీటికి సంబంధించి ఆయా పోలింగ్ కేంద్రాల్లోనూ, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోనూ నోటిఫికేషన్లు ప్రదర్శించాం. ఇరిగేషన్ అధికారులతో కలిసి సమన్వయం చేసుకుని ఎన్నికలను నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఏఈ, ఎంపీడీవో, ఏపీడీవో ఏవో, ఎఫ్‌డీవో, నేను ఇలా మండల స్థాయిలోని గెజిటెడ్ ర్యాంకు అధికారులను ఎన్నికల అధికారులుగా విధులు అప్పగించారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి పోలీస్ రక్షణ కూడా కోరాం.

– కె.అనిల్‌కుమార్, ఇన్‌చార్జి తహసీల్దారు, పెడన

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి



టి.కొత్తపాలెంలో రైతు నుంచి అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ హరనాథ్

టి.కొత్తపాలెం(నాగాయలంక): మండలంలోని టి.కొత్తపాలెం గ్రామ పంచాయతీ కార్యాయలయం ఆవరణలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో 15 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ఎం.హరనాథ్ తెలిపారు. తమ పెండిగ్ భూ సమస్యలు పరిష్కారంలో రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ జె.సీతారామ్‌కుమార్, డీటీ అబ్దుల్ రఫీ, ఈఓపీఆర్‌డీ కె.అప్పలనరసమ్మ, గ్రామ రెవెన్యూ అధికారి తలగడదీవి గంగాధర్ సాయిబాబు, టెక్నికల్ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోడూరు: పిట్టల్లంక పంచాయతీ వద్ద బుధవారం అధికారులు రెవెన్యూ సదస్సును నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనునాయక్ అధ్యక్షతన నిర్వహించిన సభలో రైతులు వివిధ సమస్యలపై అర్జీలు అందించారు. రైతులు ఆరు అర్జీలు అందించనున్నట్లు తహసీల్దార్ చెప్పారు. డీటీ పద్మప్రియ, ఆర్ఐ సుభాషిణి, వీఆర్వో గోపికృష్ణ, పాల్గొన్నారు.

పెదప్రోలు(మోపిదేవి): మండలంలోని పెదప్రోలు గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ ఏసుబాబు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు బుధవారం నిర్వహించారు. జాతీయ రహదారి నిర్మాణం కారణంగా ముంపునకు గురవుతున్న బాధిత రైతులు పక్కా డ్రైనేజీ ఏర్పాటు చేయాలని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నాదెండ్ల శరత్‌చంద్రబాబు, రైతులు తహసీల్దార్ శ్రీవిద్యకు అర్జీ అందజేశారు. 5 అర్జీలు గ్రామస్తుల నుంచి అందినట్లు తెలిపారు. దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారిణి జోగి ప్రవీణ, మండల సర్వేయర్ రామకృష్ణబాబు,ఇన్‌చార్జి ఆర్ఐ మోపిదేవి శ్రీనివాసరావు, వీఆర్ఓ నాగమల్లేశ్వరావు, కార్యదర్శి కె.రామకోటేశ్వరావు, గ్రామ సచివాలయ సహాయక సర్వేయర్ రాజు పాల్గొన్నారు.

పెడన: మండల పరిధిలోని నడుపూరు, నందిగామ గ్రామాల్లో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 18 ఆర్జీలు వచ్చాయని ఇంఛార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ తెలిపారు. ఉదయం నడుపూరులో తొమ్మిది, మధ్యాహ్నం నందిగామలో నిర్వహించిన సదస్సుల్లో 9 ఆర్జిలు స్వీకరించి వారికి రశీదులు ఇచ్చామని పేర్కొన్నారు. ఆడంగల్ వివరాలు తప్పులు పడ్డాయని, పాస్‌పుస్తకాలలోను, ఫీల్డ్‌లలో కొలతలు తేడాలున్నాయని కోరినట్లుగా తెలిపారు.

గూడూరు: మండలంలోని తరకటూరు, పినగూడూరులంక సదస్సులలో 16 అర్జీలు వచ్చాయి. తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఉదయం తరకటూరులో గ్రామసభ నిర్వహించగా 12 అర్జీలు సమర్పించారు. మధ్యాహ్నం పినగూడూరులంకలో 4 అర్జీలు వచ్చాయి. సర్పంచులు చిన్నం వెంకటరమణమ్మ, రాహెతున్నిసా, ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, కో ఆప్షన్ సభ్యుడు కరీముల్లా, మాజీ డీసీ చైర్మన్ పోతన స్వామి, ఆర్ఐ టి.రాధ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కళ్లేపల్లిలో యాపిల్ సాగు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలోని పెదకళ్లేపల్లికి చెందిన రైతు అరజా వెంకట చలపతిరావు కశ్మీరీ యాపిల్ పండ్ల సాగు చేపట్టారు. రేగు కాయల ఆకారంలో ఉన్న కశ్మీరీ యాపిల్‌లు తినడం వల్ల ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయని అంటున్నారు.

బాపట్ల జిల్లా వెల్లటూరు సమీపంలోని పెదలంక గ్రామం నుంచి విత్తనాలు సేకరించినట్లు రైతు తెలిపారు. విత్తనం నాటిన ఆరు మాసాలలో కాపు వస్తుందని, నవంబరు, డిసెంబర్, జనవరి మూడు మాసాలలో దిగుబడి ఇచ్చే ఈ పండ్ల ఆదాయం ఆశాజనకంగా ఉందన్నారు.



పెదకళ్లేపల్లిలో కశ్మీరీ యాపిల్ విక్రయిస్తున్న రైతు చలపతిరావు

వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రమేష్



వైఎస్సార్ సీపీ అధినేతతో మాట్లాడుతున్న జిల్లా యూత్ కార్యదర్శి బాబీకుమార్



ఆత్మీయ కలయిక

తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామానికి చెందిన ఎస్సీ సెల్ నేత చిట్టూరి రమేష్ (ఆర్కే), నాగాయలంక మండల నేత ఆకుల బాబీకుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలాల్లో పార్టీ పరిణామాల గురించి వివరించినట్లు చెప్పారు. – ఘంటసాల/నాగాయలంక

రైతులను నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వం

- ధాన్యం కొనుగోళ్లకు సవాలక్ష ఆంక్షలు
- రైతుల సమస్యలపై వైఎస్సార్ సీపీ పోరాటం
- 13న కలెక్టర్‌కు వినతి పత్రం
- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త సింహాద్రి రమేష్‌బాబు



పోస్టర్లను ప్రదర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, నాయకులు

అవనిగడ్డ: కూటమి ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సింహాద్రి రమేష్ బాబు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన 'అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ' పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నెలలో మూడు తుపానులు వచ్చి ధాన్యం దెబ్బతిన్నా ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేశామన్నారు. గత ఏడాది అయితే కోసిన ధాన్యం కోసినట్టు ట్రాక్టర్ల నుంచే కాటాలు వేసి రైతులు అమ్ముకున్న విషయం గుర్తు చేశారు. మంత్రి నాదెళ్ల మనోహర్ తేమశాతం గురించి ఎక్కడ ఆదేశాలు ఇచ్చామో చెప్పమని కిందిస్థాయి సిబ్బందిని భయపెడతారని, మిల్లర్లు మాత్రం 17 తేమ శాతం ఉంటేనే కొంటామని చెబుతున్నారని సింహాద్రి చెప్పారు. మంత్రి, కలెక్టర్ మాటలు మిల్లర్లు లెక్కచేయడం లేదని, ధాన్యంను అమ్మేందుకు రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధాన్యం రకాలన్నింటినీ కొంటామని సీఎం చంద్రబాబు నుంచి మంత్రుల వరకూ ఊదరగొట్టారన్నారు. ఫీల్డ్‌లో దాన్యాన్ని మిల్లర్లు తిరస్కరించడంతో నష్టపోతున్నారని చెప్పారు.

ఈనెల 13న కలెక్టర్‌కు వినతి పత్రం

రైతులకు తక్షణమే పెట్టుబడి సాయం, ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలని, రంగుమారిన ధాన్యాన్ని కొనాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈనెల 13న జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే సింహాద్రి చెప్పారు. పంటల బీమాను పునరుద్ధరించాలని, రైతులపై అదనపు భారం మోపే చర్యలను మానుకోవాలని, ఈ కార్యక్రమాన్ని విజయం వంతం చేయాలని కోరారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నజీర్‌బాబషా, నేతలు గాజుల జయగోపాల్, చింతలపూడి బాలు, కృష్ణారావు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

రూ. 9.31 లక్షల జరిమానా

మోపిదేవి: మండలంలోని అన్ని గ్రామాలల్లో గృహ, వాణిజ్య సర్వీసులు తనిఖీ చేసినట్లు ఉయ్యూరు డివిజన్ విజిలెన్స్ ఈఈ కృష్ణ నాయక్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏపీసీపీడీసీఎల్ ఈఎం సత్యానందం ఆదేశాల మేరకు ఉయ్యూరు, చల్లపల్లి, అవనిగడ్డ డీఈఈలు ప్రేమకుమార్, శివనాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, విజిలెన్స్ డీఈఈ లక్ష్మీనారాయణతో నాలుగు బృందాలుగా ఏర్పడి విద్యుత్ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. 1,674 గృహ, వాణిజ్య సర్వీసులు తనిఖీ చేశామన్నారు. వీటిలో 351 సర్వీసులు అధిక లోడు వినియోగిస్తున్నట్లు, 9 సర్వీసుల కేటగిరీ వేరుగా ఉన్నట్లు, ఒక సర్వీసు విద్యుత్ చోరీకి గురైనట్లు గుర్తించామని తెలిపారు. వాటికి సంబంధించి వినియోగదారులకు రూ.9 లక్షల 31 వేలు జరిమానా విధించినట్లు విజిలెన్స్ ఈఈ కృష్ణ నాయక్ వివరించారు. విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ తనిఖీల వివరాలు వెల్లడిస్తున్న విజిలెన్స్ ఈఈ కృష్ణనాయక్

పంటు మరమ్మతులు పరిశీలించిన ఆర్డీఓ

ఎదురుమొండి(నాగాయలంక): బందరు ఆర్డీఓ కె.స్వాతి మండలంలోని పలు ప్రాంతాల్లో బుధవారం రాత్రి ఆకస్మికంగా పర్యటించారు. ఏటిమొగ-ఎదురుమొండి గ్రామాల మధ్య పంటు మరమ్మతులను ఆమె పరిశీలించారు. సుమారు రూ.10 లక్షల అంచనాతో పంటు నిర్వాహకులు నాయుడు బాబూ రావు, నాయుడు వెంకటేశ్వరరావు చేపడుతున్న మరమ్మతు పనులను ఆర్డీఓ అడిగి తెలుసుకున్నారు. కృష్ణానదిలో భద్రత కోసం రెండు బోట్‌ల సంగడితో కట్టిన నావల్లోనే ప్రజా రవాణాకు అనుమతించినట్లు, బోట్‌లలో ప్రయాణానికి మనిషి ఒక్కంటికి రూ.10, రెండు చక్రాల బైక్‌కు రూ.50 నిర్ణయించినట్లు తహసీల్దార్ ఎం.హరనాథ్ ఆమెకు తెలిపారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించారు. రేమాలవారిపాలెం మార్కెట్ యార్డులో పౌర సరఫరాల గోదాము, ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. నాగాయలంక లోని శ్రీవెంకటేశ్వర ట్రేడర్స్ రైస్ మిల్లును పరిశీలించారు. రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు ఉన్నారు.



పంటు వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ స్వాతి

వేదాలను భావితారాలకు అందించిన సుబ్రహ్మణ్యం

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ: భారతీయ సంస్కృతికి మూలమైన వేదాలను భావితరాలకు అందించడానికి చిట్టి సుబ్రహ్మణ్యం ఘనాపాటి చేసిన కృషి మరువలేనిదని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. చిట్టి సుబ్రహ్మణ్యం ఘనాపాటి శత జయంతి వేడుకల ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ 30 సంవత్సరాల క్రితం కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి స్వామిని కలవడానికి వెళితే చిట్టి సుబ్రహ్మణ్యం ఘనాపాటి గురించి అడిగారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పలువురు వేద పండితులను ఘనంగా సత్కరించారు. పండితులు విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి, దెందుకూరి వెంకటేశ్వర ఘనాపాటి, చింతపల్లి సుబ్రహ్మణ్యశర్మ, చిట్టి చంద్రశేఖరశర్మ, మార్తి సత్యనారాయణశర్మతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన వేద పండితులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ పనులపై సమీక్ష

అవనిగడ్డ: సగంలో ఆగిపోయిన అవనిగడ్డ-కోడూరు రహదారి పనులను వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆర్అండ్‌బీ ఈఈ ఎస్.లోకేశ్వరరావుని ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ఆయన ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వంలో పనులు ప్రారంభించి ఆగిపోయిన ఈ రోడ్డు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు వస్తున్నాయని బిల్లులు గురించి అధైర్య పడొద్దని చెప్పారు. ఈ సమావేశంలో డీఈఈ ఎం.రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి వేడుక

నాగాయలంక: గీతాజయంతి పురస్కరించుకుని శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానం, స్థానిక గీతాసమాజం ఆధ్వర్యంలో ధర్మకర్త విశాలక్షి పర్యవేక్షణలో బుధవారం గీతాజయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు డీవీకే సత్యప్రసాద్ నేతృత్వంలో ఆలయంలోని శ్రీరుక్మిణీ, శ్రీసత్యభామ సమేత శ్రీవేణు గోపాలస్వామి మూల విరాట్టులకు విశేష అలంకారం జరిపి గీతా జయంతి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వేణుగోపాల గీతాసమాజం సంస్థ ఆధ్వర్యంలో ఆలయ ముఖ మండపంలో ఏర్పాటు చేసిన భగవద్గీత చిత్రపటం పీఠంపై గ్రంథపూజ జరిపి సామూహిక గీతా పారాయణం చేశారు. ఉసిరిక చెట్టు కింద గోపూజ జరిపి గో ప్రదక్షిణలు చేశారు. గీతాసమాజం సభ్యులు పోతురాజు కామేశ్వరశర్మ, ఉప్పల విఘ్నేశ్వరరావు, మాదివాడ లక్ష్మి, శేషయ్య తదితరులు పాల్గొన్నారు. మండలంలోని భవఘ్ని భక్తులు అనేక మంది గ్రంథ పఠనం, గీతారాధన కార్యక్రమాలకై పల్నాడు జిల్లా అమరావతి సమీపంలోని వైకుంఠపురంలో దివ్య, భవ్య భగవాన్ శ్రీవేదవ్యాస సనాతన ధర్మక్షేత్రానికి తరలివెళ్లారు. భావదేవరపల్లిలోని శ్రీకృష్ణ మందిరంలో గ్రామ సర్పంచ్ మండలి ఉదయభాస్కర్ దంపతుల నేతృత్వంలో, మర్రిపాలెంలో శ్రీరాధాకృష్ణ దేవస్థానంలో గీతాజయంతి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నాగాయలంక వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణుడిని దర్శించుకుంటున్న భక్తులు

పెడన: పట్టణంలోని రుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో గీతాజయంతి వేడుకలను పట్టణ హిందూ బంధువుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి గీతాజయంతి, మోక్షదా ఏకాదశి కావడంతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి వారం పెడన వచ్చి భగవద్గీతను బోధిస్తున్న ఇస్కాన్ నమహట్ట సుహాస్ గురువును సత్కరించారు. తొలుత భగవద్గీత పుస్తకాలను అందజేశారు. ఆగస్త్యేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు గూడూరు ఆగస్త్యయ్య, వేణుగోపాల స్వామి ప్రధాన అర్చకులు అగ్నిహోత్రం హరికృష్ణ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

కృత్తివెన్ను: మండలంలోని కృత్తివెన్ను, లక్ష్మీపురం, నీలిపూడి గ్రామాలలో హనుమద్వ్రతం ఉత్సవాలు బుధవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి తమలపాకులతో అర్చనలు జరిపారు. ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఐదవ రోజున కృత్తివెన్నులో భారీ అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఘంటసాల మండలం చిట్టూర్పులో..



ఘంటసాల- రామానగరం ప్రధాన రహదారి పక్కన..



కృత్తివెన్ను మండలం యండపల్లి వద్ద..



చినుకు.. వణుకు

దివిసీమలోని పలు ప్రాంతాల్లో బుధవారం పడిన చిరుజల్లులు రైతులను ఉరుకులు పరుగులు పెట్టించాయి. ధాన్యాన్ని రహదారుల పక్కన ఆరబోసుకున్న రైతులు వాటిని హడావిడిగా పట్టాలు కప్పించి రక్షించుకున్నారు. పగలంతా బాగానే ఉన్న వాతావరణం సాయంత్రం ఒక్కసారిగా మారిపోయి పలుచోట్ల ఓ మోస్తరు వర్షం పడింది. ఇంకొన్ని చోట్ల చిరుజల్లులు పడ్డాయి. దీంతో కొందరు రైతులు హడావుడిగా కుప్పలు వేశారు. ఆరబోసిన ధాన్యంపై పట్టాలు కప్పారు. ధాన్యాన్ని రక్షించుకునే పనులలో నిమగ్నమయ్యారు.

– అవనిగడ్డ/ఘంటసాల/కృత్తివెన్ను